# గోదారమ్మ-13

పెట్టిన సెలవు పూర్తవటంతో రామచంద్ర తన ఆఫీసుకు వెళ్లి వస్తున్నాడు. సీతకు, పిల్లలకు ఇంకా సెలవులున్నాయి. బడులు తెరవలేదు.

ఆ రోజు సాయంకాలం... గోదారమ్మ ఇంట్లో కనుపించకపోయేసరికి గుడికి వెళ్ళి ఉంటారని సీత అనుకుంది.

మరికొంత సమయం గడిచినా రాకపోయేసరికి సీత గోదారివైపు వెళ్ళి చూసింది.

అక్కడ దిగువ మెట్టు మీద కూర్చుని గోదాట్లో కాళ్ళు పెట్టుకుని కూర్చుని వున్న ఆవిడను చూసి... సీత చకాచకా మెట్లు దిగివచ్చి “అమ్మా... మీరిక్కడ ఉన్నారా...”అంటూ ఆమె పక్కన కూర్చుంది.

“గుడికి వెళ్ళి వస్తూ... ఎందుకోగానీ చల్లగాలికి ఇటు వచ్చాను. ఇక్కడ కూర్చుంటే... చాలా బావుంది సీతా...” అందావిడ గోదావరి నీళ్ళల్లో చేయిపెట్టి అలల్ని కదుపుతూ...!

ఆవిడ పారవశ్యాన్ని గమనించిన సీత చిరునవ్వుతో అంది.

“మీకు గోదారి అంటే ఇంత ఇష్టమని మీ తల్లిదండ్రులకి ఎలా తెలిసిందమ్మా... అంత చిన్నపుడే, మీకీ పేరు పెట్టారుకదా...?”

ఆ మాటలకి ఆవిడా చిరునవ్వుతో తల అడ్డంగా వూపింది.

“మా అమ్మ నాన్నలు ఈ పేరు పెట్టలేదు, నువ్వేగా పెట్టిందీ...?”

ఆవిడ మాటలకు సీత విస్తుపోయింది. “మీకు... నేను పేరు పెట్టడం ఏమిటమ్మా” అంది.

“ఏమో సీతా.... మీ ఇంటికి వచ్చిన రోజు...నువ్వేమన్నావో గుర్తుచేసుకో...! ‘గోదారమ్మ’ కదా మీ పేరు అన్నావ్... వెంటనే ‘భలే కనిపెట్టేసా కదా’ అనీ అన్నావ్... అందుకే... నాకూ ఆ పేరు నచ్చి... పాత పేరుని వదిలేసి... అంటే మర్చిపోయి... ఈ కొత్తపేరుతో నీకు పెద్దమ్మగా కొత్త జన్మ ఎత్తానన్నమాట! ఇలా ఉండటం...నాకు నిజంగా కొత్త జన్మలాగే చాలా ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంది!” అంది చిరునవ్వుతో ఆవిడ.

“అవునా.. అయితే... మీ అసలు పేరు ఏమిటమ్మా....?” ఆశ్చర్యపోతూ అడిగింది సీత.

సీత ప్రశ్నకి గోదారమ్మ మళ్ళీ చిరునవ్వుతో చూసింది.

“అవన్నీ మర్చిపోయిన విషయాలు, పేరు, ఊరు ఏదయితేనేం... అనవసరం అనిపించి... వదిలేసానని చెప్పాగా...!”

“సరేనమ్మా... ఆ ప్రసక్తి వదిలేస్తాగానీ.... ఇక్కడ బాగా చల్లగా, కాదు... చలిగా ఉంది. మీ ఆరోగ్యానికి అంత మంచిదికాదీ చలిగాలి. ఇంటికి వెళ్దాం...!” అంది సీత.

ఆవిడ తల అడ్డంగా ఊపింది. “లేదు సీతా... నాకు చాలా హాయిగా బావుంది ఇక్కడ ! ఈ గోదావరిని చూస్తుంటే... ‘వేదంలా ఘోషించే గోదావరి... అమరధామం లా విలసిల్లే గోదావరి’, అనే గోదారమ్మ పాట గుర్తొచ్చి గొంతెత్తి గట్టిగా పాడుకోవాలనే ఆలోచన కలుగుతోంది. అంతలా మైమరపు కలుగుతుంది, తెలుసా...! ఇలాంటి వాతావరణంలో నా చిన్నప్పటి స్మృతులన్నీ గుర్తుకొస్తున్నాయి”

ఆవిడ ఒక క్షణం తర్వాత “సీతా.... ఈ రోజు ఎందుకో చిన్నప్పటి పండగల కోసం ఎదురుచూపూ గుర్తుకొస్తుంది.. అట్లతద్దికి పిల్లలమంతా తెల్లారగట్లే లేచి వీధుల్లో ఆడుకునే ఆనవాయితీ ఉంది కదా...! నాకయితే చిన్నతనంలో ఆ ముందు రోజు రాత్రి నిద్రే పట్టేది కాదు... రాత్రి అంతా ఉలికులికి పడి లేస్తూ టైమ్ చూసుకుంటూ మళ్ళీ పడుకునేదానిని. వేకువ కాగానే లేచి పరుగుపెట్టటమే. వెన్నెల్లో... గోరింటాకు పెట్టుకుని ఎర్రగా పండిన అరచేతుల్ని చూసుకుని మురిసిపోతూ... ఇష్టంగా రోడ్డుమీద స్నేహితురాళ్ళతో కలిసి పరుగులు పెడుతూ... అబ్బ... ఎన్ని రకాల ఆటలో...! ఆ తరువాత గోదావరి నీళ్ళల్లో మునిగి స్నానాలు చేసి... తడిబట్టల్ని తటతటలాడిస్తూ ఇంటికి చేరటం ఎంత బావుండేదో...!

దసరా, సంక్రాంతి రోజుల్లో బొమ్మల కొలువులు, పేరంటాలూ చాలా ఇష్టంగా ఉండేవి! చాలామంది రకరకాల బొమ్మల్ని మెట్లవారీగా అలంకరించి పేరంటానికి పిలిచేవాళ్ళు. ఆనవాయితీ లేదంటూ మా అమ్మమ్మ కొలువు పెట్టేది కాదుగానీ పేరంటానికి తిరగటానికి మాత్రం అభ్యంతరం ఉండకపోవడంతో, అందరిళ్ళకు గుంపులుగా పిల్లలందరం అలిసిపోయేదాకా తిరుగుతూనేవుండేవాళ్ళం...! ఈ రోజు ఇలా గోదారి గట్టుమీద కూర్చుని... ఆ బంగారు బాల్యాన్ని నెమరేసుకోవటం చాలా బావుంది సీతా...! సరే, సరే, నీ మాట మీద ఇక ఇంటికి వెళ్దాంలే... మిగతావి మరిన్ని సంగతులు వీలును బట్టి నీతో పంచుకుంటాను....!”

ఆవిడ మాటలకు సీత చిరునవ్వుతో చేయి అందించి ఆవిడను ఇంటికి బయలుదేరదీసింది.

* * *

అనుకున్నట్లుగా ఒక ఆదివారం నాడు నలుగురైదుగురు కాఫీ సభ్యులూ కుటుంబాలతో కలిసి సీతా వాళ్ళింటికి వచ్చారు. అందరూ తమ ఇళ్ళ నుండి ఏదో ఒక రకం తమకు నచ్చినది చేసి తీసుకువచ్చారు. మిగతా వంటలన్నీ అందరూ కలిసి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ సీతావాళ్ళింట్లో చేసేశారు. మగవాళ్లూ కొందరు సాయంచేస్తే మరికొందరు కబుర్లతో కాలక్షేపం చేసారు. భోజనాలు మాత్రం అందరూ పిల్లా పెద్దా ఒకసారే కూర్చుని, ఆకుల్లో వడ్డించుకుని మిగతావి ఎవరకేవి కావలసి వచ్చినా వడ్డించుకునే విధంగా మధ్యలో పెట్టుకున్నారు.

అన్నింటి గురించి రుచులు చెప్పుకుంటూ, పిల్లలకు మధ్య మధ్యలో వడ్డిస్తూ బోజనాలు కానిచ్చేసి, అన్నీ చక్కబెట్టుకున్నాక కొంచెం సేపు విశ్రాంతి తీసుకుని, తర్వాత తీరిగ్గా కూర్చుని వినోద కార్యక్రమాలంటూ మొదలు పెట్టడం జరిగింది.

ముందుగా కుముద …" కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు " అనే కీర్తన చక్కగా పాడి వినిపించింది.

అందరూ శ్రద్ధగా విని, కుమదను అభినందించారు. తర్వాత రామాంజనేయులు గారి మనవలు మరి కొందరు పిల్లలతో కలిసి సినిమా పాటలకు పారడీలను పాడుతూ అభినయం చేస్తుంటే, అందరూ బాగా ఆనందించారు.

మొదటి పేరడీ పాట ఇలా సాగింది..

"కొండలా పొట్ట ఉంది… ఎంతకీ కరగనంది…

ఏందిరో, ఈ కొవ్వు గొడవ.." అని ఒక పిల్లాడు పాడగానే మరొకడు..

"ఉందిగా లైపోసక్షన్, డైటింగ్ పైన… సర్జరీల పద్ధతుంది దేనికయినా!"

అని అందుకోగానే అందరికీ నవ్వాగలేదు. అప్పుడు వాళ్ళలో ఒకడు.. "అలా కాదు పాడాల్సింది.."

"ఉందిగా మెడిటేషన్, యోగా పైన… కోత దాకా వెళ్ళొద్దు దేనికయినా…" అని సరిజేసాడు.

అలా పిల్లలు సరదాగా ఆరోగ్యం గురించి సినిమా పాటకి పేరడీగా అభినయిస్తూంటే… పెద్దలంతా నవ్వీ నవ్వీ చప్పట్లతో ఆనందాన్ని వెలిబుచ్చారు.

అలాగే పర్యావరణం గురించి రాసిన ఇంకొక పేరడీ పాటనీ మరికొందరు అభినయించారు.

అది ఇలా సాగింది..

"ప్లాస్టిక్ బూతాన్ని తరిమితరిమి కొట్టినట్టు…

ప్రజలంతా ఎకోఫ్రెండ్లీ వస్తువులే వాడినట్టు…

ఊరువాళ్ళంతా కలిసి నడుం బిగించినట్టు

వ్యర్థరహిత నగరంగా ఊరునే మార్చినట్టు….

మా ఇల్లు సూడు… మా వీధి సూడు… మా ఊరు సూడు…

నీట్… నీట్… నీట్…. నీట్, నీట్, నీట్.. మహా నీటు…

క్లీన్.... క్లీన్.... క్లీన్... క్లీన్ , క్లీన్ , క్లీన్ ...యమా క్లీను...!

గ్రీన్...గ్రీన్... గ్రీన్.. గ్రీన్, గ్రీన్, గ్రీన్... ఊరంతా గ్రీనూ..!" అంటూ స్టెప్పులతో సహా వేయగానే అందరూ చప్పట్లతో అభినందిస్తూ నవ్వులతో హోరెత్తించారు.

అలా ఆ రోజు సందడిగా సరదాగా గడిచిపోవటం అందరికీ ఆనందాన్ని కలిగించింది.

అందరూ మరోసారి సీతారామచంద్రల జంటకు అభినందనలూ, ఆశీర్వాదాలూ ఇచ్చి తమ ఇళ్ళకు బయలుదేరి వెళ్ళిపోయారు.

"అందరూ పెళ్ళయిన కొన్నాళ్ళకు తల్లిదండ్రులవుతారు. కానీ మీరు మాత్రం తల్లిదండ్రులుగా మారాక పెళ్ళి చేసుకోవటం జరిగింది...!" అంటూ గోదారమ్మ వాళ్ళని మనస్ఫూర్తిగా ఆశీర్వదించింది.

"ఆ మాట నిజమమ్మా! 'కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు పుడతాడని' మనకో సామెత ఉందిగా, అలా మేం... ఒకరుకాదు, ఇద్దరు పిల్లలకు తల్లిదండ్రులమయ్యాం! అంటే... రెట్టింపు అదృష్టవంతులమయ్యామన్నమాటేగా...!" అంది సీత నవ్వుమొహంతో.

గోదారమ్మ అవునన్నట్లు చిరునవ్వుతో తల వూపింది.

తరువాత మళ్ళీ గోదారమ్మ సీతతో అంది. "మీ అమ్మా నాన్న లిద్దరూ కూడా ఈ రోజు వరకూ ఉండి వుంటే చాలా బావుండేదిగా!" అన్న దానికి సీత చిరునవ్వుతో తలవూపి వూరుకుంది.

* * *

ఒకసారి గోదారమ్మ సీతను అడిగింది. "సీతా.... నీకు చెప్పకుండా నేనో పని చేసాను. మనం ఏర్పాటు చేసిన 'రక్షణ'కు చాలామందే సలహాలకో, సాయానికో వస్తున్నారుగా, అందుకని కౌన్సిలింగ్ లా గోవిందుని తన అనుభవాన్ని కథలా చెప్పి సలహాలిమ్మని అడిగాను. చదువుకుంటున్నాడు కాబట్టి సాయంకాలాలో, సెలవు రోజుల్లోనో సమయం ఏర్పాటు చేసుకోవచ్చన్నాను." అని ఆవిడ చెబుతుండగానే సీత అడ్డం పడింది..." ఏమిటమ్మా, మీరంటున్నదీ..మన పూర్ణ కి ఈ గోవిందు వలన అలా జరిగినందుకేగా మనం రక్షణ ఏర్పాటు చేసాం...మరి అతన్నే మీరు మళ్ళీ పిలవటం ఏమిటీ..? అంటూ ఆశ్చర్యపోయింది.

" అవును సీతా...ముందు నాకూ కోపం వచ్చింది గానీ తర్వాత విచారిస్తే, ఆ అబ్బాయి చాలా మారిపోయాడనీ, పశ్చాత్తాప పడుతున్నాడనీ తెలిసే పిలిపించాను. ముందు తను కూడా ఆశ్చర్యపోయాడు గానీ తర్వాత ఆలోచించి.... 'సరే' అన్నాడు. 'తనలా ప్రవర్తించి ఎవరూ జీవితాల్ని పాడుచేసుకోవద్దని... తన అనుభవాన్నే స్వయంగా..పాఠంలా,

సలహాగా చెప్పటం బావుంటుంది కదూ....? అది నిజంగా మంచి ఫలితాన్నీ ఇచ్చింది. ఈ మధ్య రక్షణ కి పెరిగిన ఆదరణే దానికి నిదర్శనం కదా..!" అందావిడ చిరునవ్వుతో.

"ఇంకొకటి... ఈ వూరు ఒక లంకలా ఉంది. ఒక వైపు గోదావరి, మరొకవైపు ఒక కాలువ ఉన్నాయిగా, కాలువకి అటువైపున్న ఊరులోనే హైస్కూలు ఉండటం వలన... చాలామంది చదువుకునే పిల్లలు... తొందరగా చేరవచ్చనే అభిప్రాయంతో కాలువపైనున్న చిన్న తాటిమట్ట లాంటి దానిమీద నడిచి వెళ్తున్నారు. ఒక్క అడుగు పక్కకు పడినా...నీళ్ళల్లో పడటం ఖాయమే... ఆపైన పెద్దవాళ్ళు కూడా బస్సులో చుట్టు తిరిగి వెళ్ళటం ఎందుకనే అభిప్రాయంతో కాబోలు అరటిగెలలు, పాలకాన్లు లాంటి వాటిని నెత్తిమీద పెట్టుకునే నడుస్తున్నారు. అందుకని నాకో ఆలోచన వచ్చింది. మనం ఆ కాలువపై ఒక వంతెన లాంటిది, గట్టిది ఏర్పరిస్తే బావుండదూ...?"

సీత ఎప్పటిలానే కళ్లు పెద్దవి చేసి చూసింది.."చాలా ఖర్చవుతుంది కదమ్మా....?"

ఆ మాటలకు అవునన్నట్లుగా ఆవిడా తలవూపుతూ చెప్పింది. "నిజమే కానీ ... సంకల్పబలం అంటారు చూడు... మనం గట్టిగా తలచుకుంటే సాధ్యం కాకపోతుందా...? అన్నీ పూర్తిగా ప్రభుత్వమే చేయాలంటే కుదరకపోవచ్చు. మనదీ, మన ఊరు అనుకుంటే... కొన్ని సౌకర్యాలను మనమే ఏర్పరచుకోగలగాలి! నేను అనుకున్నదేమిటంటే... ఊరు పరంగా... ప్రతీ ఇంటినుండీ ఎంత ఎవరికి వీలవుతుందో విరాళం గా ఇస్తే... దానిని బట్టి మిగతాది ప్రభుత్వం నుండి లోన్ గానయినా పొంది... పని పూర్తిచేసే విధంగా ప్రజలందరం కలిసి అర్జీపెట్టి అర్థిద్దాం! ముందుగా నేను పెద్దమొత్తాన్ని విరాళంగా ఇచ్చి... అందరికీ ఈ మాటను అపుడు వెల్లడిచేద్దాం! పిల్లలకే కాదు, పెద్దవాళ్ళకీ పొరుగూరు వెళ్ళటానికీ, వగైరా పనులకీ చాలా సులువైన పద్ధతిగా ఉంటుంది, కాబట్టి అందరూ అంగీకరిస్తారు అనుకుంటున్నాను!"

ఆ మాటలకు సీత ఆనందాన్ని ప్రకటించింది. "మీరు చెప్పింది నిజమేనమ్మా...! ప్రయత్నం చేద్దాం... తప్పకుండా ఫలిస్తుందని నాకూ అనిపిస్తోంది...! మీరిలా తలపెట్టే మంచి పనులన్నింటిలోనూ మేమూ పాలు పంచుకోగలగడం మా అదృష్టమమ్మా...!" మనస్ఫూర్తిగా అంది సీత.

గోదారమ్మ చిన్నగా నవ్వేసింది.

"సంకల్పం మాత్రమే నాదీ. కానీ దానిని సాధ్యం చేయగల సామర్థ్యం మీదీ, ఈ ఊరు వాళ్ళదీను! ఏ పని అయినా ఒక్కరి వల్ల కాదు కదా... అందరూ కలిసి పూనుకుని చేతులు కలిపితేనే సాధ్యమవుతుంది. పనికి కావలసిన అనుమతులూ, వనరులూ వగైరా పనులన్నీ పూర్తిచేయాల్సింది వర్మా, నువ్వే కదా సీతా...!"

"తప్పకుండా అమ్మా... మీరు మా వెనకుంటే, ఆ మనోధైర్యంతో అన్ని పనులూ చేసెయ్యగలం.." హుషారుగా అంది సీత .

* * *

"రామచంద్ర... పవళింపు ముగించి ఇక లేవండి...!" అంది సీత రామచంద్ర వర్మ పడుకున్న మంచం పక్కన నిలబడి.

"ఏమిటో... ఈ వేళ చాలా బద్ధకంగా ఉంది సీతా... లేవాలనిపించటం లేదు...!" మత్తుగా ఒత్తిగిల్లుతూ అన్నాడు రామచంద్ర.

"ఉంటుంది... ఉంటుంది...! అయినా లేవక తప్పదుగా చెంపమీద ఒక్కటిస్తే... మత్తు వదలి, చురుకు వస్తుంది...!" అంది సీత, అతని చెంపపై సుతారంగా చేయి తాకించి.

అతను నవ్వుతూ లేచి కూర్చుని "నిజమే సీతా... నీ చేయి తగలగానే చురుకు వచ్చేసింది...!" అంటూ బాత్ రూము వైపు అడుగులు వేసాడు.

అతను రాగానే... సీత వంటగదివైపు చేయి చాపి చూపిస్తూ సరదాగా నవ్వుతూ రాగం తీసింది.

"స్వామి రారా... సీతా మనో వల్లభా... రామచంద్ర స్వామి రారా..."

దానికి రామచంద్ర కూడా నవ్వు మొహంతో అల్లరిగా "నువ్వు అంత గారంగా రమ్మని పిలిస్తే రాకుండా ఉంటానా...?" అంటూ రాగం తీసాడు. సీత పకపక నవ్వింది.

"మరిచిపోయారా... మహాశయా... వంట చేయాలి... మనిద్దరం... అందుకనే మన సామ్రాజ్యంలోకి ఈ ఆహ్వానం!"

"అవును కదూ... పదా... ఈ సామ్రాజ్యంలో మనమే రాజు, రాణులం..! అయినా వంటంటే ఎంత...ఒక గంటేగా..." సరదాగా అన్నాడు రామచంద్ర.

ఇంతలో గుమ్మం దగ్గర నిలబడిన గోదారమ్మను చూసి సీత ఉలిక్కి పడింది. "అమ్మా... పిల్లలు లేచారా... వాళ్ళ సంగతి చూడనా...?" అనడిగిన ఆ మాటకు గోదారమ్మ తల అడ్డంగా వూపింది. "అదేం లేదు సీతా... వాళ్ళు చక్కగా వాళ్ళ పనులు వాళ్ళే చక్కబెట్టుకుంటున్నారు!" అంది.

రామచంద్ర కూడా కొంచెం సిగ్గుగా నవ్వు మొహంతో "సీతా...నేను మార్కెట్ కు వెళ్ళి కూరగాయలు తెస్తా... అపుడేం వండాలో ఆలోచిద్దాం... ఈ లోపు మీరిద్దరూ కాసేపు కబుర్లు చెప్పుకోండి..." అంటూ సంచీ తీసుకుని చకచకా అడుగులు వేస్తూ బయటకు వెళ్ళిపోయాడు.

గోదారమ్మ మంచం పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుంది.

“సీతా… రామచంద్ర కూడా చక్కగా పాడుతున్నాడు. ఈ ఇంట్లో అందరూ పాటల రాగాలు తీసే వాళ్ళే. ఇంటికి ‘పాటల పాలవెల్లి’ అని పేరు పెట్టుకుంటే చక్కగా సరిపోతుంది సుమా…!” అంది గోదారమ్మ చిరునవ్వుతో.

సీతా నవ్వింది. “కుముదకి సంగీతం టీచర్ని ఇంటి దగ్గరే ఏర్పాటు చేశాడు కదమ్మా…! వింటూ ఉండటం వలన తనకీ సంగీత జ్ఞానం అలవడింది!” అంది.

గోదారమ్మ సీతవైపు నిశితంగా చూస్తూ ఏదో అడగబోయి మళ్ళీ సందేహిస్తున్నట్లుగా ఆగింది. అది గమనించిన సీత…" అమ్మా..మీ మనసులో విషయం ఏదైనా సందేహించకుండా అడగండి. మీకా హక్కు వుంది..మా ఇద్దరి జీవితాల మీదా" అనగానే…గోదారమ్మ నసుగుతూ “నువ్వేమైనా రామచంద్రకు పుల్లటివి మామిడికాయలు, చింతకాయలు లాంటివి తెమ్మని చెప్పావా…?”

సీత ఆ ప్రశ్నకి ముందు విస్తుబోయింది. తరువాత అర్థమై “ఎందుకమ్మా అలా అడిగారూ…?” అని ఎదురడిగింది.

“అంటే… మామూలే కదా సీతా, పెళ్ళయిన వాళ్ళని అందరూ సాధారణంగా అడిగే ప్రశ్నే కదా…?”

ఆ మాటకి సీత తల విదిలించింది.

" అమ్మా…ముందు మీరిలా కూర్చోండి. వివరంగా చెబుతాను. మా పెళ్ళి అనుకున్నప్పుడు, ఒకరోజు రామచంద్ర స్కూల్ కి వచ్చి ఏదో అడగాలనుకుని మీలానే సందేహిస్తున్నట్లు నాకనిపించింది. నేనే చొరవగా అతని మొహమాటాన్ని పోగొట్టాక అతనేమన్నాడో తెలుసామ్మా..?" అని సీత వూపిరి తీసుకోగానే, గోదారమ్మ ఉత్సుకతతో చూసింది.